# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 07-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఢిల్లీలో ప్రారంభిస్తారు.**

2. **సాంకేతికత ఆధారంగా ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **హైదరాబాద్ నగరాన్ని కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు.**

4. **జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పూర్తి స్థాయిలో పని చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి సూచించారు.**

5. **దక్షిణ భారతదేశ పర్యాటకానికి ఆంధ్రప్రదేశ్ ముఖ ద్వారమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

==========================

స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఉత్తేజపరిచిన గీతంగా ప్రసిద్ధి పొందిన వందేమాతరం గేయం ఈ రోజుతో 150 ఏళ్ళు పూర్తి చేసుకుంది. 1875 నవంబర్ 7న బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన ఈ గీతం . అనంతరం 1882 లో ఆయన రచించిన బెంగాలీ నవల 'ఆనందమఠం'లో ప్రచురితమైంది. స్వరాజ్య సంగ్రామంలో భారతదేశ ప్రజలను ఏకం చేయడానికి, మాతృభూమికి ప్రాతినిధ్యం వహించే జాతీయవాద భావనను పెంపొందించడానికి ఈ గీతం చిహ్నంగా నిలిచింది. 1950లో భారత రాజ్యాంగ సభ ఈ గీతంలోని తొలి రెండు చరణాలను జనగణమనతో సమానమైన హోదాతో భారత జాతీయ గేయంగా ఆమోదించింది. వందేమాతరం 150వ సంవత్సరాన్ని పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆ గీతంలోని కొంత భాగాన్ని ఇప్పుడు విందాం.

వాయిస్ 29 సెకన్లు

-------------------------

వందేమాతరం 150వ సంవత్సరాన్ని పురస్కరించుకొని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈ రోజు నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారు. ఈ వేడుకలలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో దేశ ప్రజలంతా ఉదయం పది గంటలకు వందేమాతరం గీతం ఆలపించే ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాట్లు చేశాయి. నవంబర్ 7 2025 నుండి నవంబర్ 7 2026

వరకు ఏడాది పొడవునా వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ జాతీయ ప్రచారంలో ప్రజలు భాగమైయ్యేలా వందేమాతరం గీతాన్ని వారి స్వంత స్వరంలో రికార్డ్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయవచ్చని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

సాంకేతికత ఆధారంగా ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో "డేటా ఆధారిత పాలన"పై జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సదస్సుని ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి.. ఆల్ ఇండియా పర్మిట్లతో నడుపుతున్న ప్రైవేటు బస్సులపై సమాచార ఆధారిత సాంకేతిక ద్వారా ఏ బస్సులు ఎక్కడ తిరుగుతున్నాయో పరిశీలించాలన్నారు. సాంకేతికత ద్వారా సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

వాయిస్ 32 సెకన్లు

---------------------------

హైదరాబాద్ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తోంది కేంద్ర ప్రభుత్వమేనని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ద ప్రెస్'లో కేంద్రమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, రీజినల్ రింగ్ రోడ్డు మొదటి దశ నిర్మాణానికి 15,627 కోట్ల రూపాయల అంచనాతో నివేదిక తయారైందని దీన్ని కేంద్ర మంత్రివర్గం త్వరలో ఆమోదించనుందని చెప్పారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి వందల కోట్ల రూపాయలతో కేంద్రం ఫ్లైఓవర్లు నిర్మిస్తోందని కేంద్రమంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–ఎస్.ఐ.ఆర్ 2026కు సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నుంచి ఎస్.ఐ.ఆర్ పై దృశ్య మాధ్యమం విధానంలో నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికార్లు కలెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేక్ యాదవ్ మాట్లాడుతూ.. ఓటు హక్కుకు అర్హులైన వారందరూ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోప రహిత ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. డూప్లికేట్ ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని, క్షేత్ర స్థాయిలో విచారణ చేసి లోపాలు లేని ఓటర్ బాబితాను రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు.

---------------------------

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పూర్తి స్థాయిలో పని చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ముఖ్యమంత్రి హైదరాబాద్ లో మంత్రులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రచారం నిర్వహిస్తున్న తీరు, ప్రజాదరణ గురించి మంత్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ప్రచార గడువు ఈనెల 9తో ముగియనుండటంతో ఈ 3 రోజులు కీలకమని చెప్పారు. స్థానిక సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి హామీ ఇవ్వాలని సూచించారు.

---------------------------

దక్షిణ భారతదేశ పర్యాటకానికి ఆంధ్రప్రదేశ్ ముఖ ద్వారమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మూడో రోజు లండన్ పర్యటనలో భాగంగా వరల్డ్ ట్రావెల్ మార్కెట్ –2025 ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఇతర రాష్ట్రాల, దేశాల స్టాల్స్ ను మంత్రి నిన్న పరిశీలించారు. అదే విధంగా ఉమ్మడి మార్కెటింగ్ ప్రచారం కోసం వివిధ దేశాల, రాష్ట్రాల టూరిజం అధికారులతో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఇతర దేశాల, రాష్ట్రాల్లో పర్యాటక అభివృద్ధికి అనుసరిస్తున్న విధానాలు, అభివృద్ధి ప్రణాళికపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించారు.

---------------------------

సమాజంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ విద్యార్థి విభాగం నాయకులతో ఆయన నిన్న సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలు, ఫీజు రీఇంబర్స్‌మెంట్, వైద్య కళాశాలలు వంటి పలు అంశాలపై ఈ సమావేశం లో చర్చించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సీతంపేట సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ – ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. “జన జాతీయ గౌరవ దివస్” కార్యక్రమాలలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో విద్యార్థుల క్రీడా పోటీలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈసందర్భంగా స్వప్నిల్ జగన్నాథ్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో ఎంతో క్రీడా నైపుణ్యం దాగి ఉందన్నారు. వారి నైపుణ్యాన్ని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతం నుండి ఉత్తర కేరళ వరకు తమిళనాడు మీదుగా ఏర్పడిన ద్రోణి 5.8 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మి తెలియజేసారు.

తెలంగాణలోనూ రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాలలో తేలికపాటి వర్షాలు, కొన్ని ప్రాంతాలలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

---------------------------

=====================